క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



మండపేట జట్టుకు ట్రోఫీని అందిస్తున్న ఎస్సై జానీబాషా తదితరులు

కె.గంగవరం: మండల పరిధిలోని పామర్రు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పది రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ లెజెండ్స్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో నియోజకవర్గంలోని పలు గ్రామాలతో పాటు కపిలేశ్వరపురం నియోవజకర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు. సుమారు 35 జట్లు టోర్నమెంట్‌లో తలబడ్డాయి. ఫైనల్‌లో మండపేట జట్టు విజయం సాధించగా వెంటూరు జట్టు రన్నర్‌గా నిలిచింది. విజయం సాధించిన మండపేట జట్టుకు కె.గంగవరం ఎస్సై జానీ బాషా, గ్రామ పెద్దలు నానాపరపు శ్రీనివాస్, మరివాడ సూరబాబు ట్రోఫీని అందించి అభినందించారు.

మెరుగైన విద్యా బోధన అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నాగరాజు

కె.గంగవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యా బోధన అందించాలని ఎంఈఓ ఏ.నాగరాజు సూచించారు. మండల కేంద్రమైన కె.గంగవరంలో గల ఎమ్మార్సీ నందు మండల స్థాయి హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండల వ్యాప్తంగా పది ఉన్నత పాఠశాలలు ఉన్నాయని త్వరలో మరో రెండు ఉన్నత పాఠశాలలు వస్తాయన్నారు. కోట, బట్టపాలిక గ్రామాల్లో ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో పాటు 14 గ్రామాల్లో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటవుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 46 బేసిక్ ప్రాథమిక పాఠశాలు, ఆరు ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వాటిలో విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి పౌష్టికాహారంతో పాటు మంచి విద్యను అందించాలని కోరారు. ఎంఈఓ– 2 చోడిశెట్టి ఆంజనేయులు, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పశు సంరక్షణపై దృష్టి పెట్టాలి



శిబిరంలో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కె.గంగవరం: పాడి రైతులు పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పామర్రు పశువైద్యాధికారి డాక్టర్ బిందు సూచించారు. మండల పరిధిలోని యండగండి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామంలోని సుమారు వంద పశువులకు ఉచితంగా గర్భకోశ, చూడి పరీక్షలను పశు వైద్యులు నిర్వహించారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్‌తో పాటు పలు రకాల మందులు అందించారు. చూడి పరీక్షలు చేసి నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.

తాచుపాము హతం



ఆర్యావటంలో స్థానికుల చేతిలో హతమైన తాచుపాము

కాజులూరు: మండలంలోని ఆర్యావటం శివారు తుమ్మలపల్లిలంకలో స్థానికుల చేతిలో భారీ తాచుపాము హతమయ్యింది. ఆర్యావటం, వేలంగి రహదారిలోని రొయ్యల చెరువుల వద్ద పనిచేస్తున్న కొందరు తాటాకులతో తాత్కాలిక గృహాలు ఏర్పాటు చేసుకొని నివాసముంటున్నారు. ఈ నివాసాలకు సమీపంలో మంగళవారం సుమారు పది అడుగల తాచుపాము హల్‌చల్ చేసింది. దీంతో భయభ్రాంతులకు గురైన స్థానికులు కర్రలు, గడ్డపారలతో పామును హతమార్చారు. ఈ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా పాము సంచరిస్తుండటంతో చెరువుల వద్దకు పనికి వచ్చిన కూలీలు ప్రాణ భయంతో పనులు మానేసి వెళ్లిపోతున్నారని స్థానిక రైతులు చెబుతున్నారు. ఎట్టకేలకు పాము హతమవ్వడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

బెల్లపుఊట ధ్వంసం

కొత్తపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సుమారు 1600 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేసినట్టు సీఐ కె.కాత్యాయని తెలిపారు. స్థానిక శీలంవారిపాలెం, బాబానగర్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి సారా తయారీకి భూమిలో ఊరబెట్టిన సుమారు 1600 లీటర్ల బెల్లపుఊటను గుర్తించారు. దానిని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదు నామ మాత్రమే!

- సవరణలో స్వల్ప పెరుగుదల
- గతేడాదితో పోలిస్తే 5,319 మంది ఓటర్ల పెరుగుదల
- క్లస్టర్ పరిధిలో ఓటర్లు 4,23,611
- 25న జాతీయ ఓటరు దినోత్సవం



ఓటు వేసేందుకు క్యూలో వేచి ఉన్న ఓటర్లు (ఫైల్)

రాయవరం: అవినీతి అంతానికి, ప్రజా వ్యతిరేక ప్రభుత్వాల పతనానికి ఓటు వజ్రాయుధం లాంటిది. దేశంలో అనేక మంది పాలకులను గద్దె దించిన ఘనత ఓటుకు ఉంది. ఈ ఏడాది ఎన్నికల కమిషన్ నిర్వహించిన ఓటర్ల సవరణలో అతి తక్కువగా ఓటర్లు పెరిగారు. ఏడాది లోపు ఎన్నికలు లేక పోవడంతో ఓటర్ల నమోదుకు పెద్దగా స్పందన లభించ లేదు. రాజకీయ పార్టీలు, యువత ఓటర్ల నమోదు కార్యక్రమానికి దూరంగా ఉండడంతో నమోదు ఆశించిన స్థాయిలో జరగలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతేడాదితో పోలిస్తే కేవలం 5,319 మంది ఓటర్లు మాత్రమే పెరగటం శోచనీయం.

బహుళ ప్రయోజనకారిగా ఓటరు కార్డు

ప్రజాస్వామ్యంలో మనల్ని మనం కాపాడుకునేందుకు, దేశ ప్రగతికి ఓటు మార్గదర్శిగా ఉపకరిస్తుంది. దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లినా, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, పథకాలు పొందడానికి ఓటరు కార్డు బహుళ ప్రయోజనకారిగా మారింది. అవినీతిని అంతం చేసేందుకు ఓటే సర్వస్వంగా భావించి ఓటరు నమోదుకు యువత చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉంది.

25న జాతీయ ఓటరు దినోత్సవం

ఓటర్లకు చైతన్యం కల్పించేందుకు ప్రతి ఏటా జనవరి 25వ తేదీన ఎలక్షన్ కమిషన్ జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. అవగాహన ర్యాలీలు, ఓటర్లకు ముగ్గుల పోటీలు నిర్వహించడంతో పాటు సీనియర్ ఓటర్లను సత్కరించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. రెవెన్యూ శాఖ అధికారులు పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తున్నారు.

యువతలో నిర్లిప్తత

ఓటు హక్కు నమోదు చేసుకోవడంలో యువతలో నిర్లిప్తత కనబడుతోంది. దేశ భవిష్యత్తుకు పునాదిరాళ్లుగా ఉన్న యువత ఓటు హక్కుపై పెద్దగా స్పందిండం లేదన్న విషయాన్ని అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. జనాభాలో 30 శాతం వరకు ఉన్న యువత ఓటు హక్కు కలిగి ఉండడం లేదు. ఓటు నమోదు సమయాల్లో యువత ఓటు హక్కు నమోదు చేసుకోవడం కోసం కళాశాలల్లో ప్రత్యేక అవగాహనా తరగతులు సైతం నిర్వహిస్తున్నా అంతగా ప్రయోజనం ఉండడం లేదు.

ఓటు నమోదు ఇలా..

బూత్ స్థాయి అధికారులు, తహసీల్దారు కార్యాలయంలో ఓటరు నమోదు ఫారాలు తీసుకుని పూరించిన అనంతరం వాటిని బూత్‌స్థాయి అధికారులకు అందజేయాలి. నూతనంగా ఓటు హక్కు పొందే వారు ఫారం–6, తొలగింపులు, అభ్యంతరాలకు ఫారం–7, మార్పులకు ఫారం–8, ఒకే నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రం మార్పునకు ఫారం – 8ఏలను పూర్తి చేసి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ఫారాలు ఓటర్లకు అందుబాటులో ఉంచారు.

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఓటర్ల వివరాలు ఇలా..

మండలం	పురుషులు	స్త్రీలు	థర్డ్ జండర్	మొత్తం
రాయవరం	25,902	27,232	02	53,136
మండపేట టౌన్	23,142	25,667	00	48,809
మండపేట రూరల్	31,257	33,108	04	64,369
కపిలేశ్వరపురం	26,874	27,230	00	54,104
రామచంద్రాపురం అర్బన్	17,183	18,531	00	35,714
రామచంద్రాపురం రూరల్	28,839	29,380	01	56,982
కె.గంగవరం	26,179	26,098	00	52,277
కాజులూరు	28,488	28,494	00	56,982
మొత్తం	2,07,864	2,15,740	07	4,23,611

ప్రత్యేక కార్యక్రమాల ఏర్పాటు



జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓటు హక్కుపై అవగాహన, చైతన్యం కల్పించేందుకు పోలింగ్ బూత్‌లు, తహసీల్దారు కార్యాలయాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అవగాహన ర్యాలీలు నిర్వహించడంతో పాటు 80 ఏళ్ల దాటిన సీనియర్ ఓటర్లను సత్కరించేందుకు ఆదేశాలు ఇచ్చాం.

– ఐవీ.శెట్టి, తహసీల్దారు, రాయవరం.

23న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

రామచంద్రపురం: మండపేటలో ఈ నెల 23న ఏపీఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు ఈఈ కె రత్నాలరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలతో పాటు వివిధ రకాల ఇబ్బందుల పరిష్కారానికి ఏపీఈపీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు మసిల మణి, ఎస్ మురళీ కృష్ణ కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాయవరం: రామచంద్రపురం డివిజన్ పరిధిలోని మండపేట సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఈ నెల 23న నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రత్నాలరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్.మసిలమణి, ఆర్థిక సభ్యులు షేక్ బాబర్, స్వతంత్ర సభ్యులు ఎస్.మురళీకృష్ణ హాజరు కానున్నట్లు తెలిపారు.

మండపేట: ఈ నెల 23న విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సీజీఆర్ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో 23న మారేడుబాక సబ్ స్టేషన్ వద్ద వేదికను నిర్వహిస్తున్నామన్నారు. పట్టణ ప్రజలంతా ఈ విషయాన్ని గ్రహించి తమ సమస్యలను వేదిక దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు.

పోలమ్మా.. మము చల్లంగ చూడమ్మా!

- వైభవంగా పోలమాంబ జాతర
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



పోలమ్మతల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రాయవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల నీరాజనాలు అందుకుంటున్న పోలమాంబ అమ్మవారి జాతర మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. రజిత వజ్ర కిరీట ధారియై.. నిత్య పూజలందుకుంటున్న రాయవరం పోలమ్మతల్లి భక్తులకు సిరుల తల్లిగా దర్శనమిచ్చారు. వార్షిక ఉత్సవం సందర్భంగా అమ్మవారిని గజమాలలు, ఆభరణాలతో నయనానందకరంగా అలంకరించారు. భక్తుల కొంగు బంగారంగా వందల ఏళ్ల నుంచి నిత్య పూజ లందుకుంటున్న అమ్మవారికి కొప్పువెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతరను కన్నుల పండువగా నిర్వహించారు. వేకువ జామునుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. కోరిన కోర్కెలు నెరవేరాలని, పాడి పంటలు, పిల్లా పాపలను చల్లగా చూడాలని కోరుతూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి ఆరు గంటల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి పోటెత్తారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు పశ్చిమ, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో జాతరకు తరలి వచ్చారు. కొప్పువెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నౌడు వెంకటరమణ ఆధ్వర్యంలో జాతరను ఘనంగా నిర్వహించారు. మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పర్యవేక్షణలో రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో 50 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు.

జాతరను పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. తీన్‌మార్, బ్యాండు మేళాలు, గరగ నృత్యాలు, సంగీత విభావరులు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. డైనోసార్, ఎలుగుబంటి, శక్తివేషాలు, భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ, మిరుమిట్లు గొలిపే బాణాసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అమ్మవారి సన్నిధిలో ప్రముఖులు

అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. భక్తులకు దర్శనానికి అవసరమైన ఏర్పాట్లను పోలమ్మతల్లి ఆలయ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ ఆధ్వర్యంలో చేపట్టారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ప్రముఖ వైద్యులు జీఎస్‌ఎన్ రెడ్డి, తేతలి నవీన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కుష్ఠు రహిత సమాజానికి సహకరించాలి

- కమిషనర్ అయ్యప్ప నాయుడు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ అయ్యప్ప నాయుడు

రామచంద్రపురం: కుష్ఠు రహిత సమాజం రూపుదిద్దుకోవడానికి ప్రజలంతా సహకరించాలని కమిషనర్ ఓ అయ్యప్ప నాయుడు కోరారు. జిల్లా డిప్యూటీ పారా మెడికల్ అధికారి మాధవరపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లెప్రసీ కేసు డిటెక్షన్ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ అయ్యప్ప నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని వ్యాధి నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు వ్యాధి సోకిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రతల గురించి వివరించారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం ముచ్చిమిల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివారెడ్డి, కోట హరిజన పేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యుడు సుధీర్, నోడల్ పర్సన్ చిక్కాల సూర్యారావు, హెల్త్ సూపర్‌వైజర్ బేబీ రాణి, రిటైర్డ్ డిప్యూటీ పారా మెడికల్ అధికారి గొల్లపల్లి కృష్ణ , ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు స్టీలు కుర్చీల అందజేత



దాత అందజేసిన కుర్చీలతో హెచ్‌ఎం రమాదేవి, సిబ్బంది

కపిలేశ్వరపురం: మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన దాత ప్రొఫెసర్ గొడవర్తి భాగవన్నారాయణ స్టీలు కుర్చీలను సమకూర్చారు. తన తల్లి గొడవర్తి పర్వత వర్ధనమ్మ జ్ఞాపకార్థం సుమారు రూ.18 వేలు విలువ చేసే త్రీ సిట్టింగ్ స్టీల్ కుర్చీలను అందజేశారు. దాతను పాఠశాల ప్రధానోపాధ్యాయిని రమాదేవి, ఉపాధ్యాయులు వాడ్రేవు శ్రీనివాస్, రాజశేఖర్, బాలు, రామారావు, కుమారి తదితరులు అభినందించారు.

పశుపోషణ ప్రాధాన్యాన్ని గుర్తించాలి

పశువైద్య శిబిరాల రాష్ట్ర ప్రత్యేకాధికారి రాధాకృష్ణ



నల్లూరులో పాడి రైతుకు మందులు అందజేస్తున్న వైద్యాధికారులు

కపిలేశ్వరపురం: పశుపోషణ ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని పశువైద్య శిబిరాల రాష్ట్ర ప్రత్యేక అధికారి కె.రాధాకృష్ణ అన్నారు. పశు సంవర్థక శాఖ ఆలమూరు సహాయ సంచాలకులు ఎల్.అనిత ఆధ్వర్యంలో మంగళవారం నల్లూరు, వాకతిప్ప గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. నల్లూరులో శిబిరాన్ని సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ ప్రారంభించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు, ప్రత్యేకాధికారి డాక్టర్ కె.రాధాకృష్ణలు మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 30 వరకు క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న శిబిరాల్లో పశువులకు నట్టల నివారణ, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేస్తారన్నారు. కోళ్లకు టీకాలు వేస్తారన్నారు. పశువులకు మూడు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందజేస్తారన్నారు. శిబిరంలో పశు వైద్యాధికారి వైద్యులు రమణ మూర్తి, లక్ష్మీమాధురి వైద్య సేవలందించారు.

తపాలాశాఖ కార్యాలయాల సందర్శన



రాయవరం కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ శేషారావు

రాయవరం: రాజమహేంద్రవరం డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు మంగళవారం ఉప తపాలా శాఖ కార్యాలయాలను సందర్శించారు. రాయవరం తపాలా శాఖ కార్యాలయ పరిధిలోని లొల్ల, మహేంద్రవాడ, కొప్పవరం, కొమరిపాలెం, వి.సావరం సబ్ పోస్టల్ కార్యాలయాలను తనిఖీ చేశారు. కార్యాలయాల పనితీరు, రికార్డుల నిర్వహణ, ఆధార్ నమోదు, సవరణల ప్రక్రియను పరిశీలించారు. రాయవరం బ్రాంచి పోస్ట్ మాస్టర్ సీహెచ్.రవిప్రకాష్‌తో మాట్లాడి పలు విషయాలపై ఆరా తీశారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తపాలా శాఖ సిబ్బంది సురేష్, ఫణికుమార్, వినాయక్ తదితరులున్నారు.

శుభ్రత పాటించకుంటే చర్యలు తప్పవు

- మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు



చాందిని టిఫిన్ సెంటర్ నిర్వాహకులను హెచ్చరిస్తున్న కమిషనర్

మండపేట: పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వ్యాపారాలు నిర్వహించే వ్యాపారులంతా తప్పనిసరిగా శుభ్రత పాటించాలని, లేని పక్షంలో వారి వ్యాపారానికి సంబంధించిన లైసెన్సులు రద్దు చేస్తామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు హెచ్చరించారు. పురపాలక సంఘాన్ని ఆరోగ్యవంతంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా గత నాలుగు రోజులుగా పట్టణమంతా కలియ తిరుగుతున్నారు. మున్సిపల్ డీఈ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజును వెంట బెట్టుకుని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఇతర తినుబండారాల దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. మంగళవారం మెయిన్ రోడ్డు, రాజారత్న రోడ్డులో వ్యాపార సంస్థలను ఆయన తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించారు. చెత్తా చెదారాలను ఇష్టం వచ్చినట్టు డ్రెయిన్లలోనూ, షాపుల ముందు పారవేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. వెలువడిన చెత్తను డస్ట్‌బిన్లలో వేసి పారిశుధ్య కార్మికులకు అప్పగించాల్సిన బాధ్యత ఆయా వ్యాపార సంస్థల నిర్వాహకులదేనని స్పష్టం చేశారు. రాజారత్న రోడ్డులో చాందిని టిఫిన్ సెంటర్ వద్ద అపరిశుభ్ర వాతావరణాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.200 అపరాధ రుసుము విధించారు.

భీమేశ్వరాలయానికి ఫ్లెక్సీల గ్రహణం



ద్రాక్షారామ భీమేశ్వరాలయం కనిపించకుండా సప్త గోదావరి వద్ద పెట్టిన ఫ్లెక్సీలు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వారి ఆలయానికి రాజకీయ గ్రహణం పట్టి పీడిస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోనికి వెళితే.. అతి ప్రాచీన దేవాలయంగా, త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, పంచారామాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా ప్రసిద్ధి చెందిన భీమేశ్వరాలయం సెంట్రల్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ స్వాధీనంలో ఉంది. అయితే రాజకీయ నాయకులు తమ ప్రచారం కోసం ఆలయం తూర్పున ఉన్న సప్త గోదావరిని ఆనుకుని ప్రధాన రహదారిపై ఫ్లెక్సీలు పెట్టడం అలవాటుగా మారింది. గత ప్రభుత్వంలో వ్యవస్థలు సక్రమంగా పని చేయడంతో ఈ ప్రాంతంలో ఫ్లెక్సీలు పెట్టినా ఆయా సందర్భాలను అనుసరించి అక్కడ ఫ్లెక్సీలు పెట్టిన వారికి కేవలం నాలుగు రోజుల వ్యవధి మాత్రమే ఇచ్చి తరువాత తీసి వేసేవారు. కానీ ప్రస్తుతం గత ఏడాది డిసెంబరు నెలలో పెట్టిన ఫ్లెక్సీలు జనవరి 1, సంక్రాంతి పండుగ సందర్భాలు అయిపోయినా నేటికీ తీసి వేయించడంలో అటు దేవాదాయ శాఖ అధికారులు కానీ, సెంట్రల్ ఆర్కియాలజీ డిపార్టుమెంటు వారు గానీ, ఇటు ద్రాక్షారామ పంచాయతీ వారు గానీ, ద్రాక్షారామ పోలీసులు గానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆలయ ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని, ఆర్కియాలజీ డిపార్టుమెంటు ఎంటీఎస్ కె.సత్యనారాయణలను వివరణ కోరగా ఫ్లెక్సీలు పెట్టిన వారికి సమాచారం ఇచ్చామని వారు తీయకపోతే రెండు డిపార్టుమెంట్లు సమన్వయంతో తీసివేస్తామని తెలిపారు.

ఘనంగా గాణాల జయంతి



రామ్మూర్తికి నివాళి అర్పిస్తున్న విశ్వ బ్రాహ్మణులు

మండపేట: విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేసిన స్వర్గీయ గాణాల శ్రీరామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని పట్టణ విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. టౌన్‌హాలు ఎదురుగా ఉన్న శ్రీ కామాక్షీ ఏకామ్రేశ్వర విశ్వబ్రాహ్మణ మండపంలో మంగళవారం సంఘ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు వీరమల్లు శ్రీనివాస్, గోడి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గాణాల రామ్మూర్తి 1932 బ్రిటిష్ పాలనలో ఎమ్మెల్సీగా పని చేశారన్నారు. వేముల శ్రీరామ్మూర్తి, పట్నాల శ్రీనివాసు, కోటిపల్లి కృష్ణ, చెల్లూరి కుమారస్వామి, కోరుకొండ వీరబాబు, కడియపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి

కపిలేశ్వరపురం: నియోజకవర్గంలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్టు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండలంలోని అంగర, కోరుమిల్లి, వాకతిప్ప, నాగులచెరువు గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అంగర గ్రామంలో సీసీ రహదారుల నిర్మాణాలకు రూ.85 లక్షలు, వాకతిప్పకు రూ.5 లక్షలు, కపిలేశ్వరపురం గ్రామ శివారు నారాయణలంక, కోరుమిల్లి, కేదారిలంక, నాగుల చెరువు గ్రామాలకు రూ.20 లక్షల చొప్పున, మొత్తం 1.70 కోట్లు మంజూరయ్యాయి. కార్యక్రమంలో సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, ఆచంట సత్యనారాయణ, ఎంపీటీసీ సుంకర వెంకటేశ్వరరావు, తహసీల్దార్ చిన్నారావు, నాయకులు పుత్సల శ్రీనివాస్ పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన



ఉండూరులో లేగ దూడల ప్రదర్శనను తిలకిస్తున్న వైద్యాధికారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉండూరులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం, లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. గ్రామానికి చెందిన 32 మంది పాడి రైతులు తమకు చెందిన 38 లేగ దూడలను ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి పశు కిసాన్ కార్డుల ప్రయోజనాలను, పశు గ్రాస ప్రాముఖ్యతను ప్రత్యేకాధికారి రాధాకృష్ణ రైతులకు వివరించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె. వెంకట్రావు, రామచంద్రపురం ఏడీ ఓ.రామకృష్ణలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల పశు వైద్యాధికారి మేడిశెట్టి కృష్ణార్జున, కోటిపల్లి, పేకేరు, కె.గంగవరం పశు వైద్యాధికారులు డాక్టర్ సంయుక్త, డాక్టర్ జి. సురేష్‌బాబు, డాక్టర్ భావన జ్యోతి, సిబ్బంది వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో పశు గణాభివృద్ధి సంస్థ డైరెక్టర్లు డాక్టర్ కె.కల్యాణి, తోట నవీన్, పశు వైద్య సిబ్బంది, పశు వైద్య సహాయకులు, గోపాలమిత్రలు, పాడి రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఈ-కేవైసీ తప్పనిసరి

కాజులూరు: గ్రామాలలో దాళ్వా పంట సాగుచేస్తున్న రైతులంతా తప్పని సరిగా పంటల నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని శలపాక రైతు సేవా కేంద్రంలో వీఏఏ అనూషా అధ్యక్షతన జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని గ్రామాలలో 19,500 ఎకరాల సాగు భూమికి గానూ 17 వేల మంది రైతు ఖాతాలు ఉన్నాయన్నారు. వీరందరూ తప్పని సరిగా ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి ఈ–కేవైసీ (వేలిముద్రలు) చేయించుకోవాలన్నారు.